**ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానములో**

**అమరావతి**

**గౌరవనీయ జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు**

**రిట్ పిటిషన్ నెం.455 ఆఫ్ 2022**

**మార్చి 3వ తారీఖు, 2022**

అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్,

...అర్జీదారులు/పిటిషనర్లు

మరియు

ది విశాఖ పోర్ట్ ట్రస్ట్ ... ప్రతివాది

పిటిషనర్ల తరఫు న్యాయవాది : శ్రీ ఎ. సత్య ప్రసాద్
సీనియర్ న్యాయవాది
శ్రీ వి.హరీష్

ప్రతివాది తరఫు న్యాయవాది : శ్రీ పి.రఘురామ్
సీనియర్ న్యాయవాది
శ్రీ రవితేజ పాడిరి
స్టాండింగ్ కౌన్సెల్

రిఫర్ చేసిన కేసులు:

1) 2018 ఎస్ సిసి ఆన్ లైన్ 8269
2) సివిల్ అప్పీల్ నెం.4862-4863 ఆఫ్ 2021
3) సివిల్ అప్పీల్ నెం.1949 ఆఫ్ 2019
4) (2008) 16 ఎస్. సి.సి. 215

**గౌరవనీయులైన శ్రీ జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు**

**రిట్ పిటిషన్ నెం.455 ఆఫ్ 2022**

**ఆదేశాలు**

సీనియర్ న్యాయవాదులు మరియు విశాఖ పోర్ట్ ట్రస్ట్ ( సంక్షిప్తంగా VPT)కౌన్సెల్ వారి సమ్మతి తో ఈ రిట్ పిటిషన్ ను విచారించాడమైనది.

04.10.2021 నాటి టెండర్ నెం. 7&8/2021(IM&EE/MOF/Mech-WQ-7&8/2021) లో పిటిషనర్ పాలుగొనటానికి అనర్హులు అని ప్రతివాది ప్రకటించటం చట్టవిరుద్ధం, సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘించడం అని ఆరోపిస్తూ ఈ రిట్ దాఖలు చేసారు.

పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది శ్రీ ఎ.సత్యప్రసాద్, ప్రతివాది తరపున సీనియర్ న్యాయవాది పి.రఘురామ్ వాదనలు వినిపించారు.

**పిటిషనర్ కేసు:**

పిటిషనర్ తరపు న్యాయవాది శ్రీ సత్య ప్రసాద్ వాదనలు వినిపిస్తూ, డబ్ల్యూక్యూ 7, డబ్ల్యూక్యూ 8 బెర్త్ ల యాంత్రీకరణ కోసం ఐఎం అండ్ ఈఈ/ఎంఓఎఫ్/మెచ్-డబ్ల్యూక్యూ7-8/2021తో కూడిన టెండర్ లో పిటిషనర్ సంస్థ పాల్గొనాలనుకుంటున్నట్టు తెలిపారు.

కొన్ని ముఖ్యమైన విషయాలను బహిర్గతం చేయలేదనే కారణంతో మొదటి దశలోనే పిటిషనర్ పై అనర్హత వేటు వేశారు. ఈ నిర్ణయాన్ని పిటిషనర్ కు తెలియజేయలేదని, కేవియట్ దాఖలు చేసి, పిటిషనర్ కు కేవియట్ నోటీసులు జారీ చేసిన తర్వాత మాత్రమే తాము అనర్హులమనే వాస్తవాన్ని గ్రహించామని సీనియర్ న్యాయవాది చెప్పారు. ప్రతివాది విశాఖ పోర్టు ట్రస్ట్ అనుసరిస్తున్న విధానం పూర్తిగా తప్పని సీనియర్ న్యాయవాది వాదించారు. అనర్హత వేటు న్యాయసమ్మతమైనది కాదని అన్నారు. ఈ సందర్భంగా తగిన ఆదేశాలు ఇవ్వాలని వాదించారు.

బిడ్డర్ యొక్క సాంకేతిక, ఆర్థిక మరియు O&M అనుభవాన్ని వివరించే టెండర్ షరతుల క్లాజ్ 2.2.2 గురించి సీనియర్ న్యాయవాది ఈ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. క్లాజ్ 2.2.2 లోని అన్ని షరతులను పిటిషనర్ నెరవేర్చారని సీనియర్ న్యాయవాది వాదించారు. AVCTPL అనే సంస్థ పిటిషనర్ కు 100 శాతం అనుబంధ సంస్థ అని న్యాయవాది వాదించారు. పిటిషనర్ ప్రస్తుత బిడ్ ను విపిటి తిరస్కరించింది, ఎందుకంటే సంబంధిత AVCTPL మరియు VPT మధ్య గతంలో ఉన్న ఒప్పందం రద్దు చేయబడింది మరియు ఈ వాస్తవాన్ని బహిర్గతం చేయలేదు. ప్రస్తుత కేసులో బిడ్ షరతులోని క్లాజ్ 2.2.8 నెరవేరలేదని దాఖలు చేసిన కేవియట్ పిటిషన్ (పేరా 4, 6 లో) వెల్లడైందని న్యాయవాది వాదించారు. క్లాజ్ 2.2.8 కేసు వాస్తవాలు, పరిస్థితులకు వర్తించదని, ఏవీసీటీపీఎల్ ఒప్పందాన్ని రద్దు చేసిందని, సీనియర్ న్యాయవాది వాదించారు. ఈ విషయంగా రిట్ అఫిడవిట్ లోని 9 నుండి 11 వరకు గల పేరాలను ప్రస్తావించారు. ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నది AVCTPL కానీ ప్రతివాది VPT కాదు అని వివరించారు. పిటిషనర్ అన్ని వివరాలను వెల్లడించారని సీనియర్ న్యాయవాది వాదించారు. అనుబంధం-1/అనుబంధం-1 లో ఈ క్రిందివి ఉన్నాయని కూడా ఆయన వాదించారు.

క్లాజ్ 7 -

> "7. దరఖాస్తుదారుడు మరియు వారి అసోసియేట్లలో ఎవరైనా గత ప్రాజెక్టులు, ఒప్పంద వివాదాలు, లిటిగేషన్, మరియు ఉల్లంఘనలు వెల్లడించాలి"

రిట్ అఫిడవిట్ లోని 11 వ పేరా ప్రకారం తాము అన్ని వాస్తవాలను, మధ్యవర్తిత్వాలను వెల్లడించామని, వాస్తవాలను దాచిపెట్టలేదని వాదించారు. కాబట్టి ప్రతివాది-VPT యొక్క చర్యను ఈ క్రింది కారణాల వల్ల రద్దు పరచాలని అభ్యర్థించారు-

(ఎ )బిడ్ యొక్క క్లాజులు ఉల్లంఘించబడలేదని/కప్పిపుచ్చలేదని మరియు

(బి) ప్రతివాది పోర్ట్ ట్రస్ట్ తిరస్కరణను సరైన పద్ధతి లో లేదా డాక్యుమెంట్ ద్వారా తెలియజేయలేదు.

సీనియర్ న్యాయవాది ***అట్లాంటా లిమిటెడ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా [2018 SCC online 8269]*** తీర్పును ప్రస్తావిస్తూ క్లాజ్ 2.2.8 ప్రతివాదికి అపరిమితమైన అధికారాన్ని ఇస్తుందని, అందువల్ల ఇది నిరంకుశమైనది మరియు అసమంజసమైనది అని వాదించారు.

**<u>ప్రతివాదుల వాదనలు:</u>**

దీనికి సమాధానంగా వీపీటీ సీనియర్ న్యాయవాది శ్రీ రఘురాం వాదిస్తూ

వాస్తవాలను మరుగుపరిచారని బొగ్గు టెర్మినల్ (ఏవీసీటీపీఎల్)తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని కూడా వీపీటీ రద్దు చేసింది అని తెలిపారు.

ఒప్పందాన్ని సక్రమంగా నిర్వర్తించకపోవడం, ఒప్పందాన్ని నిర్వర్తించడంలో విఫలం కావడం, క్లెయిమ్ లు, కౌంటర్ క్లెయిమ్ లకు దారితీసే తీవ్రమైన ఆరోపణల ఆధారంగా మధ్యవర్తిత్వాన్ని ప్రయోగించారని ఆయన పేర్కొన్నారు. 2.2.8 క్లాజులోనే అనర్హత గురించి స్పష్టంగా ఉందని సీనియర్ న్యాయవాది వాదించారు. కేవియట్ కమ్యూనికేషన్ ద్వారా పిటిషనర్ కు ఎలాంటి అన్యాయం జరగలేదని ఆయన అభిప్రాయపడ్డారు. 05.01.2022 న పిటిషనర్ కు వ్రాసిన లేఖలో కూడా గతంలో ఏవీసీటీపీఎల్ కాంట్రాక్ట్ రద్దయిన కారణంగా వారి బిడ్ ని అంగీకరించలేమని తెలియజేశారు. బిడ్ డాక్యుమెంట్ లోని క్లాజ్ 2.7, 2.7.3 ఆధారంగా బిడ్ ను తిరస్కరించే హక్కు ప్రతివాది వద్ద ఉందని ఆయన వాదించారు. వారు బిడ్ను తిరస్కరించవచ్చు లేదా ఎటువంటి కారణం ఇవ్వకుండా ప్రక్రియను రద్దు చేయవచ్చు. తాను ఎవరితో ఒప్పందం కుదుర్చుకోవాలో ఎంచుకునే హక్కును హరించలేమని, కాంట్రాక్టర్/అసోసియేట్లతో గత అనుభవాన్ని ప్రతివాది పరిగణనలోకి తీసుకోవాల్సిన సంబంధిత అంశమని సీనియర్ న్యాయవాది వాదించారు. అనుబంధ సంస్థ కాంట్రాక్టును రద్దు చేసిన వాస్తవాన్ని బహిర్గతం చేయనందువల్ల పిటిషనర్ తో తదుపరి ఒప్పందాలు చేసుకోవడానికి నిరాకరించే హక్కు విపిటికి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది కాంట్రాక్ట్ లో తప్పనిసరి షరతు అని ఆయన అన్నారు. ***యుఫ్లెక్స్***

***లిమిటెడ్, ৮ గవర్నమెంట్ ఆఫ్ తమిళనాడు***[1] **కేసులో** గౌరవనీయ భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ నిరంకుశత్వం, అహేతుకత, పక్షపాతం ఉంటే ఇలాంటి విషయాల్లో న్యాయసమీక్షకు అనుమతి ఉంటుందని, పరిమిత పరిస్థితుల్లో కోర్టు జోక్యం చేసుకోవచ్చని సీనియర్ న్యాయవాది వాదించారు. ఈ కారకాలు ఏవీ ప్రస్తుత కేసులో లేవని వాదించారు. టెండర్ డాక్యుమెంట్ లోని పదాలకు వాటి అసలు అర్థం మరియు అవసరమైన ప్రాముఖ్యతను ఇవ్వాలని వాటిని విస్మరించడానికి వీల్లేదని ఆయన వాదించారు. సీనియర్ న్యాయవాది ప్రకారం న్యాయ సమీక్ష సూత్రాలు కేవలం నిర్ణయం తీసుకునే ప్రక్రియను సమీక్షించడానికి మాత్రమే పరిమితం. టెండర్ నిబంధనలు డొమైన్ నిపుణులచే నిర్ణయించబడతాయి కాబట్టి ఈ విషయాన్ని నిపుణులకు వదిలివేయాలని అన్నారు. ప్రతివాది-విపిటి చేసిన తప్పు ఏదీ లేదని సీనియర్ న్యాయవాది తన వాదనలు ముగించారు.

**<u>న్యాయ స్థానం:</u>**

బిడ్డర్ స్పష్టమైన వివరాలను బహిర్గతం చేయకపోవడంతో దీర్ఘకాలిక కూటమి ప్రారంభంలోనే విఫలమైంది.

ఈ కేసు నిర్ణయించటానికి అనుబంధం-1 లోని క్లాజులు 2.2.8, 2.7.1., 2.7.3 మరియు క్లాజ్ 7 పరిగణించాలి:

> "**2.2.8**: ఏదైనా కన్సార్టియం సభ్యుడు లేదా అసోసియేట్ తో సహా దరఖాస్తుదారుడు, గత 3 (మూడు) సంవత్సరాల్లో, ఏ కాంట్రాక్ట్ పైనైనా పనితీరు కనబరచడంలో విఫలం అయ్యి ఉండకూడదు. దరఖాస్తుదారుడు, కన్సార్టియం సభ్యుడు లేదా అసోసియేట్ పై మధ్యవర్తిత్వ లేదా న్యాయపరమైన తీర్పు లేదా మధ్యవర్తిత్వ తీర్పు ద్వారా ఏదైనా ప్రభుత్వ సంస్థ ద్వారా ఏదైనా ప్రాజెక్ట్ లేదా కాంట్రాక్ట్ నుండి బహిష్కరించబడి ఉండకూడదు లేదా కాంట్రాక్ట్ రద్దు కాబడి ఉండకూడదు. దరఖాస్తుదారుడు, కన్సార్టియం సభ్యుడు లేదా అసోసియేట్ ఈ క్లాజ్ 2.2.8 లో పేర్కొనబడిన ఏదైనా కారణం లేదా సంఘటన కారణంగా తన అనర్హత ఉత్పన్నమవుతుందని పేర్కొన్నట్లయితే, అది (ఎ) అటువంటి కారణం లేదా సంఘటనకు సంబంధించి తన వైపు నుండి ఎటువంటి దుర్వినియోగం లేదని; (బి) సంబంధిత ఒప్పందంలోని మెటీరియల్ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించలేదని; (సి) అటువంటి ఒప్పందానికి

---

1 సివిల్ అప్పీల్ నెం.4862-4863 ఆఫ్ 2021

సంబంధించి ఎటువంటి మోసం లేదని (డి) అటువంటి ఒప్పందాన్ని రద్దు చేయడం లేదా విడిచిపెట్టడం చేయలేదని ఈ మేరకు అథారిటీని అభ్యర్థించవచ్చు. అథారిటీ తన విచక్షణాధికారం మేరకు సంతృప్తి చెందితే, అభ్యర్థి పైన అనర్హతను మాఫీ చేయవచ్చు.

– **2.7.1:** ఏదైనా దరఖాస్తును ఆమోదించడానికి లేదా తిరస్కరించడానికి మరియు బిడ్డింగ్ ప్రక్రియను రద్దు చేయడానికి మరియు అటువంటి ఆమోదానికి, తిరస్కరణకు లేదా రద్దుకు ఎటువంటి కారణాలను కేటాయించకుండా అన్ని దరఖాస్తులు/బిడ్ లను తిరస్కరించే హక్కు అథారిటీకి ఉంటుంది. ఒక వేళ అథారిటీ అన్ని బిడ్లను తిరస్కరించినా లేదా రద్దు చేసినా కొత్త బిడ్ అర్హులైన బిడ్డర్ల నుండి ఆహ్వానించవచ్చు.
.....

– **2.7.3:** పరిశీలన సమయంలో లేదా కన్సెషన్ అగ్రిమెంట్ పై సంతకం చేయడానికి ముందు లేదా దాని అమలు తరువాత మరియు అగ్రిమెంట్ చెల్లుబాటు కాలంలో దరఖాస్తుదారుడు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ముందస్తు అర్హత షరతులను నెరవేర్చలేదని లేదా దరఖాస్తుదారుడు వాస్తవాలను తప్పుగా చూపించాడని లేదా తప్పుడు సమాచారాన్ని ఇచ్చినట్లు తెలిసిన్నట్లయితే, ఆ దరఖాస్తుదారుడు అనర్హుడు. ఒక వేళ LOA జారీ చేసి ఉంటే అథారిటీ వారు ఏ బాధ్యత వహించకుండా వ్రాత పూర్వకంగా అగ్రిమెంట్ రద్దు చేయవచ్చు.

**అనుబంధం-1 క్లాజ్-7**: దరఖాస్తుదారుడు మరియు దాని కన్సార్టియంలోని ప్రతి సభ్యుడు (వర్తించే చోట) లేదా వారి అసోసియేట్లలో ఎవరైనా గత ప్రాజెక్టులు, ఒప్పంద వివాదాలు మరియు ఇటీవలి కాలంలో లిటిగేషన్ / మధ్యవర్తిత్వంలో మెటీరియల్ పనిచేయకపోవడం లేదా ఒప్పంద పాటించకపోవడాన్ని వెల్లడించే ధ్రువీకరణ క్రింద ఇవ్వబడింది (అవసరమైతే అదనపు షీట్లను జతచేయండి).

ప్రతివాది వీపీటీ, ఏవీసీటీపీఎల్ మధ్య గతంలో ఒప్పందం జరిగిందని, దీనికి సంబంధించి వివాదాలు ఉన్నాయని స్పష్టమైంది. పిటిషనర్ కు 100 శాతం అనుబంధ సంస్థ ఏవీసీటీపీఎల్. ఈ విషయాన్ని పిటిషన్లలో అంగీకరించారు. పిటిషనర్లు దాఖలు చేసిన ఒక లిఖితపూర్వక నోట్ 08.10.2020 ప్రకారం 120 రోజుల ప్రతికూల పరిస్థితులు కొనసాగిందని, ఎవిసిటిపిఎల్ ఒప్పందాన్ని పరస్పరం రద్దు చేసుకోవాలని కోరింది. ఆ తర్వాత 21.10.2021 న ఎవిసిటిపిఎల్ తన రద్దు నోటీసును పంపింది. కనీస గ్యారంటీ

కాంట్రాక్టును సాధించడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ విశాఖ పోర్ట్ ట్రస్ట్ 03.10.2020 న ఆ ఒప్పందం కింద నోటీసును జారీ చేసింది. అందులో సారాంశాన్ని ఏవీసీటీపీఎల్ ఖండించింది. దీనిపై తొలుత 23.11.2020 న నోటీసు పంపిన వీపీటీ, ఆ తర్వాత 26.12.2020 న తొలగింపు నోటీసు ఇచ్చారు. ఈ కేసు ఇప్పుడు సుప్రీంకోర్టుకు చెందిన ముగ్గురు గౌరవ మాజీ న్యాయమూర్తుల ముందు మధ్యవర్తిత్వంలో ఉంది. లిఖితపూర్వక నోట్ ద్వారా ఈ వాస్తవాలు తెలిపింది.

ఈ విధంగా అనుబంధంలోని క్లాజ్ 7 ఇప్పుడు ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఒప్పంద వివాదాలు మరియు లిటిగేషన్ / మధ్యవర్తిత్వంతో పాటు గత ప్రాజెక్టులలో ఏదైనా పనితీరు లేదా ఒప్పంద నిభందనలు పాటించకపోవడం గురించి బహిర్గతం చేయాలని స్పష్టంగా పేర్కొంది. వాస్తవానికి, ఈ వాస్తవాలను బహిర్గతం చేయడానికి అదనపు షీట్లను బిడ్ డాక్యుమెంటుకు జతచేయాలని ఈ క్లాజులోనే పేర్కొంది. ఈ కేసులో రిట్ అఫిడవిట్ లోని పేరా 11 లో పిటిషనర్ సదరు ఏవీసీటీపీఎల్, వీపీటీల మధ్య మధ్యవర్తిత్వం పెండింగ్ లో ఉందని మాత్రమే వెల్లడించారు తప్ప రద్దు గురించి కానీ, గతం లోని కాంట్రాక్ట్ అమలు జరపకపోవటం గురించిగురించి కానీ ఏమీ వెల్లడించలేదు. (అనుబంధం-1 యొక్క క్లాజ్ 7 తో క్లాజ్ 2.2.8).

క్లాజ్ 2.2.8 'అనర్హత'కు సంబంధించినది కాదని వాదిస్తున్నారు. క్లాజ్ 2.2.8 ను ఇప్పటికే వివరించడము జరిగింది. ఇది రెండు భాగాలుగా ఉంటుంది. పార్ట్ (ఎ) పనితీరులో వైఫల్యం గురించి జ్యుడీషియల్ అథారిటీ, ఆర్బిట్రేటర్, ట్రిబ్యునల్ తీర్పుల ద్వారా తెలుస్తుంది. దరఖాస్తుదారుడు మరియు కన్సార్టియం సభ్యుడు లేదా అసోసియేట్ ఏదైనా ఉల్లంఘనకు పాల్పడితే, వారిని కాంట్రాక్ట్ లేదా ప్రాజెక్ట్ నుండి బహిష్కరించడం ప్రభుత్వ సంస్థ ఒప్పందాన్ని రద్దు చేయడం గురించి కూడా ఇది తెలియచేస్తుంది. క్లాజ్, 2.2.8 లో పేర్కొన్న ఒక "సంఘటన కారణంగా అనర్హత"అనేది అటువంటి ఏదైనా ఒప్పందం యొక్క దుర్వినియోగం, ఉద్దేశపూర్వక డిఫాల్ట్ లేదా రద్దు లేదా రిమాండ్ మొదలైన వాటిని ప్రతిబింబించదని దరఖాస్తుదారుడు భావిస్తే, దానిని అథారిటీ పరిగణనలోకి తీసుకోవచ్చు. అందువల్ల 2.2.8, వాస్తవాలను వెల్లడించకపోవడం అనర్హత కాదన్న పిటిషనర్ తరపు

వాదనను ఈ కోర్టు అంగీకరించడం లేదు. దరఖాస్తుదారుడు ఏదైనా ప్రాజెక్ట్ నుండి బహిష్కరించబడి ఉన్నా లేదా ఏదైనా ప్రభుత్వ సంస్థ ఆ ఒప్పందాన్ని రద్దు పరచినా, ఆ చర్యలు చెల్లుబాటు కావని లేదా సరైనవి కావని భావిస్తే, దరఖాస్తుదారుడు ఒక అభ్యర్థన చేయవచ్చు అని క్లాజు స్పష్టంగా ఉంది. ఇది అనర్హతకు కారణమా కాదా అని నిర్ణయించుకునే విచక్షణాధికారం ప్రతివాదికి ఉంటుంది. కాబట్టి అనర్హత వేటుకు కూడా క్లాజ్ 2.28 వర్తిస్తుంది.

క్లాజ్ 2.7 ప్రతివాదికి ఎటువంటి కారణాలను పేర్కొనకుండా ఏదైనా బిడ్ ను ఆమోదించే లేదా తిరస్కరించే హక్కును ఇస్తుందని కూడా ఈ కోర్టు గుర్తించింది. ఇది తొలుత అపరిమితమైన అధికారంగా అనిపించవచ్చు. చట్టం ప్రకారం ప్రభుత్వ చర్య అనేది కేవలం సహేతుక కారణాల పైన ఆధార పడాలి, లేకపోతే అది ఏకపక్ష నిర్ణయం అవుతుంది. ప్రస్తుత కేసులో అనర్హత వేటుకు కారణాలు ఉన్నాయన్నది వాస్తవమే అయినప్పటికీ, నిజానికి పిటిషనర్ కు అధికారిక నోటీసు ద్వారా తెలియజేయలేదు. కేవియట్ ద్వారానే అనర్హత వేటుకు గల కారణాలను పిటిషనర్ కు తెలియజేసారు. 05.01.2022 న రిట్ పిటిషన్ దాఖలు చేయబడింది. అదే రోజు అనర్హతను కూడా సిఎంఇ లేఖ ద్వారా పిటిషనర్కు తెలియజేశారు. ఈ కోర్టు అభిప్రాయం ప్రకారం, ప్రతివాది పోర్ట్ ట్రస్ట్ ఒక అధికారిక లేఖ / నోటీసు ద్వారా కారణాలను తెలియచేసి ఉండవలసింది. అధికారికంగా తెలియజేయడంలో విఫలం కావడానికి గల కారణాలను కౌంటర్ అఫిడవిట్ లోని 15 వ పేరాలో పొందుపరిచారు. ఈ కోర్టు అభిప్రాయం ప్రకారం, దీనిని మరింత మెరుగ్గా నిర్వహించి, అధికారిక కమ్యూనికేషన్ తెలియజేసి ఉండవచ్చు, కానీ అధికారిక లేఖ ద్వారా ఈ విషయాన్ని తెలియజేయడంలో విఫలమైనంత మాత్రాన పిటిషనర్కు ప్రయోజనం ఉండదు. ఈ కోర్టు అభిప్రాయం ప్రకారం, పిటిషనర్ కు "పోస్ట్ డెసిషన్" విచారణ లభిస్తుంది తప్ప అధికారిక కమ్యూనికేషన్ లేకపోవడం వల్ల ఎటువంటి హాని కలుగదు. వాస్తవానికి, రిట్ లో ఎక్కడ కూడా కమ్యూనికేషన్ లేకపోవడం వల్ల నష్టం జరిగిందని ఆరోపించలేదు.

చట్ట ప్రకారం కోర్టు ఈ అంశం పై కాంట్రాక్ట్, టెండర్ వ్యవహారాల్లో నిర్ణయం తీసుకునే ప్రక్రియను మాత్రమే పరిశీలించాలి. ఈ విషయం లో చట్టం స్పష్టంగా ఉంది కాబట్టి

మళ్లీ పునరుద్ఘాటించాల్సిన అవసరం లేదు. ప్రతివాది తరపు న్యాయవాది ప్రస్తావించిన కేసు కూడా స్పష్టంగా ఉంది. ***యుఫ్లెక్స్ లిమిటెడ్.,*** 2 వ పేరాలో ఈ క్రింది విధంగా ఉంది:

> 2. ఇలాంటి కాంట్రాక్ట్ వ్యవహారాల న్యాయసమీక్షకు కొన్ని పరిమితులు ఉంటాయి. న్యాయసమీక్ష యొక్క ముఖ్య ఉద్దేశ్యం పాలనాపరమైన చర్యలలో నిరంకుశత్వం, అహేతుకత, అసమంజసం, పక్షపాతం, దురుద్దేశాలను నిరోధించడానికి అని ఈ కోర్టు అభిప్రాయపడింది. ఈ నిర్ణయం న్యాయ సమంజసంగా ఉన్నదా లేదా అని తెలుసుకోవటం దీని ఉద్దేశ్యం. టెండర్ల మూల్యాంకనం, కాంట్రాక్టుల కేటాయింపులో పార్టీలు వాణిజ్య సూత్రాలకు లోబడి నడుచుకోవాలి. ఆ మేరకు సమన్యాయం, సహజ న్యాయ సూత్రాలు వర్తించవు.

***విదర్భ ఇరిగేషన్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ వర్సెస్ అనోజ్ కుమార్ గర్వాల్***[2] **కేసులో** ఇలా చెప్పబడింది:

> "15) టెండర్ డాక్యుమెంట్ లో ఉపయోగించిన పదాలకు అదే అర్థాన్నిఆపాదించాలి. ముఖ్య షరతును విస్మరించే అధికారం ఆ వ్యక్తికి ఉండదు.అటువంటి చర్య టెండర్ షరతుల నిబంధనలను అర్థం చేసుకోవడంలో అవకతవకలకు దారితీయవచ్చు. అప్పుడు న్యాయస్థానం జోక్యం చేసుకుని రావలిసి ఉంటుంది.

ప్రస్తుత కేసును పై రెండు కేసులు మరియు ఈ అంశంపై ఇతర తీర్పుల నేపథ్యంలో చూసినట్లయితే, ప్రతివాది తన ఒప్పంద భాగస్వాములను ఎన్నుకునే హక్కును విస్మరించలేము. ఈ ప్రయోజనం కోసం ప్రతివాది తన బిడ్డర్లు మరియు వారి కన్సార్టియంలు, అసోసియేట్లు మొదలైన వారితో గల గత అనుభవాన్ని పూర్తిగా విస్మరించలేము. ఈ కారణంతోనే బిడ్ డాక్యుమెంట్ లో బిడ్డర్ కు, దాని కన్సార్టియం సభ్యులు, అసోసియేట్స్ కు గతంలో విధించిన జరిమానాలు, ప్రస్తుతం ఉన్న వివాదాలు మొదలైన వాటిని స్పష్టంగా వెల్లడించాలని బిడ్డర్లను కోరే క్లాజులు ఉన్నాయి. బిడ్డర్, దాని అసోసియేట్ సభ్యులు, దాని అసోసియేట్లు, కన్సార్టియం సభ్యులు మొదలైన వారి ట్రాక్ రికార్డ్ అనేది చాలా ప్రాముఖ్యత కలిగిన విషయం. ముఖ్యంగా భారీ పెట్టుబడులతో కూడిన ఇటువంటి దీర్ఘకాలిక ఒప్పందాలు, వాటి జాప్యానికి కలిగే పరిణామాలు మొదలైనవి. ఓడరేవు ఏడాదిలో 24×7, 365 రోజులు

---

2 సివిల్ అప్పీల్ నెం.1949 ఆఫ్ 2019

పనిచేయాలన్న వాస్తవాన్ని ఈ కోర్టు విస్మరించకూడదు. ఈ కారణంగానే క్లాజ్ 7 ప్రకారం బిడ్డర్, దాని అసోసియేట్లు, కన్సార్టియం సభ్యులు మొదలైన వారు గత వివాదాలు, వ్యాజ్యాలు, మెటీరియల్ నాన్ పెర్ఫార్మెన్స్ మొదలైన వాటిని వెల్లడించాల్సి ఉంటుంది. ఇంతకు ముందు ప్రస్తావించిన క్లాజులు 2.2.7 మరియు 2.2.8 కూడా ఇలాంటి అంశాల గురించి వివరిస్తాయి. క్లాజ్ 2.2.7 ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉంది, ఎందుకంటే ఏదైనా ఒప్పందాన్ని రద్దు చేసినట్లయితే దానిని స్పష్టంగా పేర్కొనాలి మరియు ప్రతివాడది దృష్టికి తీసుకురావాలి. ఇది కేవలం దరఖాస్తుదారుడికే మాత్రమే పరిమితం కాకుండా దరఖాస్తుదారుడు, అసోసియేట్లు, దాని కన్సార్టియం సభ్యులు మొదలైన వారిని కూడా దీని పరిధిలోకి తెస్తుంది. 2.2.8 లోని నిబంధన ప్రకారం దరఖాస్తుదారుడికి తన అనర్హతపైన ఏదైనా ఆక్షేపం ఉంటే దానిని విస్మరించాలని పేర్కొంటూ ప్రతివాది పోర్ట్ ట్రస్ట్ కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇది పిటిషనర్ చేయలేదు.

కోర్టు దృష్టికి తీసుకువచ్చిన క్లాజ్ 2.7.3 కూడా ఈ కేసుకు వర్తిస్తుంది. పరిశీలన సమయంలో బిడ్డరు ఏదైనా తప్పుడు సమాచారం ఇచ్చినట్లయితే, అతన్ని అనర్హులుగా ప్రకటించడానికి ప్రతివాది పోర్ట్ కు ఈ క్లాజ్ ప్రత్యేక అధికారాలను ఇస్తుంది. అంతేకాకుండా ఒకవేళ ఒప్పందం పూర్తి అయి ఆ ఒప్పందాన్ని రద్దు చేయడానికి కూడా ఈ క్లాజ్ విపిటి కి అధికారం ఇస్తుంది. అందుకే బిడ్డరు సరైన వాస్తవాలను ధ్రువీకరించటం అనేది అంత ప్రాముఖ్యతను సంతరించుకుంది.

ఈ బిడ్/టెండర్ డాక్యుమెంట్ కింద సరైన మరియు స్పష్టమైన వెల్లడికి ఇది ప్రాముఖ్యత ఇవ్వబడింది మరియు ఇది పూర్తి సమాచార బహిర్గతం యొక్క అవసరాన్ని స్పష్టంగా నొక్కి చెబుతుంది.

ఎవరితో ఒప్పందాలు కుదుర్చుకోవాలో ఎంచుకునే స్వేచ్ఛ ప్రతివాది కలిగి ఉండాలి. ఈ కారణంగానే బిడ్ డాక్యుమెంట్ లో ఈ క్లాజులను స్పష్టంగా పేర్కొన్నారు. ఒకవేళ ప్రతివాది ఏకపక్షంగా వ్యవహరించినట్లయితే *దురుద్దేశం* నిరంకుశత్వం, అహేతుకత, పక్షపాతం మొదలైనవి ఆపాదించవచ్చు. న్యాయస్థానం జోక్యం చేసుకోవచ్చు. లేని పక్షంలో ఆర్టికల్

226 ప్రకారం జోక్యం చేసుకునే అధికారాన్ని ఈ కోర్టు ఉపయోగించజాలదు. ఈ విషయంలో సహజ న్యాయం సూత్రాలు వర్తించవు. ప్రతివాది తన యొక్క వ్యాపార విజ్ఞతను ఉపయోగించే స్వేచ్ఛను ఇవ్వాలి. ఒకవేళ విధానపరమైన అవకతవకలు జరిగినా కోర్టులు అంత తేలికగా జోక్యం చేసుకోకూడదు. ***సిమెన్స్ పబ్లిక్ కమ్యూనికేషన్ నెట్వర్క్స్ (పి) లిమిటెడ్ v భారత యూనియన్[3] కేసులో*** ఈ క్రింది విధంగా చెప్పబడింది:

> 40. ప్రస్తుత కేసులోని వాస్తవాలు, పరిస్థితులను పరిశీలిస్తే, పిటిషనర్లకు అనుకూలంగా కాంట్రాక్ట్ మంజూరులో కోర్టు జోక్యాన్ని సమర్థించే ప్రమాణాలు ఏవీ లేవని మేము అభిప్రాయపడుతున్నాము. టెండర్లు లేదా కాంట్రాక్టుల కేటాయింపుకు సంబంధించిన విషయాల్లో న్యాయసమీక్ష అధికారాన్ని ఉపయోగించినప్పుడు, కొన్ని ప్రత్యేక లక్షణాలను పరిగణనలోకి తీసుకోవాలి. కాంట్రాక్ట్ అనేది ఒక వాణిజ్య లావాదేవీ మరియు టెండర్లను మదింపు చేయడం మరియు కాంట్రాక్టులు ఇవ్వడం వాణిజ్య విధులు. ఇలాంటి సందర్భాల్లో సమన్యాయం, సహజ న్యాయ సూత్రాలు దూరంగా ఉంటాయి. కాంట్రాక్టుల కేటాయింపునకు సంబంధించిన నిర్ణయం సరైనదైతే, న్యాయస్థానాలు న్యాయసమీక్ష అధికారాన్ని వినియోగించి, జోక్యం చేసుకోవు.

ఈ కోర్టు జోక్యం చేసుకోవాలంటే వాది ముందుగా నిరంకుశత్వం, అహేతుకత, పక్షపాతం స్పష్టంగా రుజువు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత కేసును పరిశీలిస్తే, ప్రతివాది చర్యను తప్పుపట్టలేమని కోర్టు అభిప్రాయపడుతోంది కౌంటర్ అఫిడవిట్ లో ప్రతివాది తన చర్యను సమర్థించుకున్నారు. కన్సార్టియం సభ్యుడు వీసీటీపీఎల్ (పిటిషనర్ సహచరుడు)తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు 9 నుంచి 13 పేరాల్లో ప్రతివాది స్పష్టంగా పేర్కొన్నారు. గత ఒప్పందంలో సభ్యుడిపై ఉల్లంఘనల ఆరోపణలు ఉన్నాయి. నోటీసులు జారీ చేసిన తర్వాత సదరు ఒప్పందాన్ని రద్దు చేశారు. సదరు కన్సల్టేషన్ నోటీసుకు కౌంటర్ గా ఏవీసీటీపీఎల్ తొలగింపు నోటీసు జారీ చేసిందని కూడా స్పష్టంగా పేర్కొన్నారు. పిటిషనర్లు దాఖలు చేసిన నోట్సు పరిశీలిస్తే, 03.10.2020 న ప్రతివాది-విపిటి 03.10.2020 న ఎవిసిటిపిఎల్కు కన్సల్టేషన్ నోటీసు జారీ చేసినట్లు స్పష్టమవుతుంది. 08.10.2020 న ఎవిసిటిపిఎల్ ప్రతికూల పరిస్థితులు చాలాకాలంగా కొనసాగుతున్నాయని, అందువల్ల, వారు

---

3 (2008) 16 SCC 215

ఒప్పందాన్ని పరస్పరం రద్దు చేసుకోవాలని కోరారు. 21.10.2021 న ఎవిసిటిపిఎల్ విపిటి (ప్రతివాది) తో ఒప్పందం రద్దు కోసం నోటీసును పంపింది. దీంతో వీపీటీ 26.12.2020 న టెర్మినేషన్ నోటీసు పంపింది. 23.04.2021 నుంచి కాంట్రాక్టును రద్దు చేసినట్లు వీపీటీ ఏవీసీటీపీఎల్కు తెలిపింది. కౌంటర్, కేవియట్, పిటిషనర్ దాఖలు చేసిన నోట్ ఈ విషయాలను స్పష్టం చేస్తున్నాయి. ఒప్పంద వివాదాలు, విజ్ఞప్తులతో పాటు గత ప్రాజెక్టుల్లో పనితీరు లేదా ఉల్లంఘనలు బిడ్డర్లు వెల్లడించాలని అనుబంధం 1 అనుబంధంలోని క్లాజ్ 7 స్పష్టంగా పేర్కొంది. కన్సార్టియంలోని ప్రతి సభ్యుడు ఈ వాస్తవాన్ని ధృవీకరించాలి. క్లాజ్ 2.2.8 ప్రకారం అసోసియేట్ కాంట్రాక్ట్ రద్దు అయిన విషయాన్ని పిటిషనర్ వెల్లడించాలి. వాస్తవానికి కౌంటర్ అఫిడవిట్లో ఈ విషయాలను స్పష్టంగా పేర్కొన్నారు కానీ పిటిషనర్లు దీనిని ఖండించలేదు. ప్రతి జవాబు దాఖలు చేయలేదు. ఈ కోర్టు అభిప్రాయం ప్రకారం, మధ్యవర్తిత్వం పెండింగ్ లో ఉంది అని చెప్పడం సరిపోదు. బిడ్ డాక్యుమెంట్ లోని క్లాజులు 2.2.8/2.7.3 ప్రకారం గత ప్రాజెక్టుల్లో ఏవైనా కాంట్రాక్ట్ ఉల్లంఘన ఉంటే స్పష్టంగా చెప్పాలి. ఈ విషయాన్ని వెల్లడించడంలో పిటిషనర్ విఫలం కావడాన్ని వీపీటీ గుర్తించింది.

పై కారణాలవలన పిటిషనర్ పై అనర్హత వేటుకు దారితీసే నిర్ణయ ప్రక్రియను తప్పు పట్టలేమని కోర్టు అభిప్రాయపడుతోంది. సదరు నిర్ణయ ప్రక్రియలో నిరంకుశత్వం, అహేతుకత లేదు. అక్టోబర్, 2021 లో పిటిషనర్లు వారి 100% యాజమాన్యంలోని అనుబంధ సంస్థ యొక్క ఒప్పందాన్ని రద్దు చేయడం అనే విషయం మరియు డిసెంబర్, 2020 / మార్చి, 2021 లో విపిటిల రద్దును వెల్లడించడంలో వారు విఫలమయ్యారు. షరతుల ఉల్లంఘన, మునుపటి ఒప్పందంలో రెండు వైపుల నుండి ఒప్పంద నిబంధనలు పాటించకపోవడం అనే ఆరోపణలు పిటిషనర్లు పైన ఉన్నాయి.

ఈ బిడ్ లో పాల్గొనదల్చిన పిటిషనర్ కు , టెండర్ నిబంధనలను కానీ లేక బిడ్డర్లను అనర్హులుగా ప్రకటించడానికి ప్రతివాదులకు ఏకపక్ష అధికారాన్ని ఇచ్చారని అని కానీ ప్రశ్నించే అర్హత లేదు.

ఈ కారణాల వల్ల ఈ కోర్టు జోక్యం చేసుకోవటం లేదు. పర్యవసానంగా రిట్ పిటిషన్ ను ఖర్చులు లేకుండా డిస్మిస్ చేయటం జరిగింది.

తత్ఫలితంగా ఇతర అప్లికేషన్ లు పెండింగ్, ఏవైనా ఉంటే, క్లోజ్ చేయబడుతాయి.

---

**డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు, జె.**

తేది: 03.03.2022

గమనిక: ఎల్ఆర్ కాపీ మార్క్ చేయాలి.

B/o
Ssv

**గౌరవనీయులైన శ్రీ జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు**

**<u>రిట్ పిటిషన్ నెం.455 ఆఫ్ 2022</u>**

**<u>తేది: 03.03.2022</u>**

SSV